LetzChange
Simple Social Giving

# సాయం చెయ్యాలనుందా..?




**ఒకటో తారీఖున జీతం ఎకౌంట్‌లో పడగానే 'ఈ నెల కొంత డబ్బుని ఏదైనా మంచి స్వచ్ఛంద సంస్థకు ఇవ్వాలి' అని చాలామంది అనుకుంటారు. కానీ ఆ 'మంచి' సంస్థ ఏదో తెలియక నిర్ణయాన్ని వాయిదా వేస్తుంటారు. లెట్స్ ఛేంజ్... ఆ సమస్యను తగ్గిస్తుంది. ఇచ్చేది పది రూపాయలైనా ఎవరికి చేరితే ఎక్కువగా ఉపయోగపడుతుందో పక్కాగా సూచిస్తుంది.**

దేశంలో 33 లక్షలకు పైగా స్వచ్ఛంద సంస్థలున్నాయని అంచనా. అందులో ఎన్ని నిజాయితీగా పనిచేస్తున్నాయి, ఎవరి వల్ల ఎక్కువమంది లాభపడుతున్నారనే విషయాలను తెలుసుకోవడం కష్టమైన పనే. ప్రతి సంస్థ వెబ్‌సైట్లోకీ వెళ్లి వాళ్ల వార్షిక నివేదికలనూ, చేస్తున్న సేవనూ భేరీజు వేయడం అందరికీ సాధ్యం కాదు. నిజంగా సేవ చేసే సంస్థలు కూడా సరైన ప్రచారం లేక, విరాళాలు రాక మంచి పనికి మధ్యలోనే స్వస్తి పలకాల్సిన పరిస్థితి. అందుకే అటు విరాళాలిచ్చే వాళ్లకూ, ఇటు సమాజానికి మంచి చేసేవాళ్లకూ మధ్య వారధిలా ఉంటూ ఇద్దరి పనినీ సులభతరం చేస్తోంది 'లెట్స్ ఛేంజ్'. సంస్థ స్థాపించిన కొత్తల్లో ప్రభుత్వ గుర్తింపు ఉన్న కొన్ని ఎన్జీవోల వార్షిక నివేదికలను పరిశీలించి వాటి స్థాయిని అంచనావేసింది. అన్ని అంశాల్లోనూ మెరుగ్గా ఉన్న 120 సంస్థలను ఎంపిక చేసి 'లెట్స్ ఛేంజ్' బృందం అక్కడికెళ్లి స్వయంగా కార్యక్రమాలను పరిశీలించింది. తరవాత ఆయా సంస్థల్లో జరుగుతున్న కార్యక్రమాలను చిన్న చిన్న డాక్యుమెంటరీలుగా తీయించి తమ వెబ్‌సైట్‌లో ఉంచింది. సంస్థల చరిత్రలూ, వ్యవస్థాపకుల వివరాల్లాంటివి కాకుండా, తెల్లవారు జాము నుంచి పొద్దుపొడిచే వరకూ ఆ సంస్థలు ఎలా పనిచేస్తాయో పక్కాగా చిత్రీకరించింది. ఆన్‌లైన్‌లో వినియోగదారులూ ఆ కార్యక్రమాల్లోని నిజాయతీని గుర్తించారు. తోచినంత డబ్బుని విరాళంగా ఇవ్వడం మొదలుపెట్టారు. వాళ్ల మాటసాయంతో మరికొంతమందికీ విషయం తెలిసింది. అలా నెమ్మదిగా 'లెట్స్ ఛేంజ్' లక్ష్యం దిశగా అడుగులేసింది.

### ఐదునెలల్లో రూ.కోటి...

మొదట మారుమూల ప్రాంతాల్లో ఉంటూ స్వచ్ఛందంగా సేవ చేసే సంస్థలకు ప్రచారం కల్పించే ఉద్దేశంతోనే 'లెట్స్ ఛేంజ్' మొదలైంది. కానీ ఆన్‌లైన్ పరిధి పెద్దది కావడం, పెద్ద మొత్తంలో విరాళాలు వచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి మచ్చా లేని సంస్థలను జల్లెడ పట్టి వాటికి సాయపడేందుకు సిద్ధమైంది. కేవలం స్వచ్ఛంద సంస్థలతో సరిపెట్టకుండా, డిగ్రీ పూర్తి చేయాలనుకునే ఆటో డ్రైవర్, ఆడపిల్లల పెళ్లి చేయాలనుకునే రైతు, స్వయం ఉపాధి వెతుక్కోవాలనుకునే యువకులు... ఇలా అవసరమున్న ప్రతి ఒక్కరికీ సాయం చేసేందుకు ముందుకొచ్చింది. రానురానూ సంస్థకు ఆదరణ పెరుగుతుండటంతో, వెబ్‌సైట్‌లో అవసరార్థుల వివరాలను పేర్కొనడంలో చాలా జాగ్రత్తగా ఉంటోంది. సంస్థ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి నిజానిజాలను నిర్ధరించుకున్నాక కానీ వాటికి ప్రచారం చేయట్లేదు. తమ పరిశీలనకు సాక్ష్యాలను సైతం జోడించి వెబ్‌సైట్‌లో పెడుతుండటంతో దాతల పనీ సులువవుతోంది. ఈ ఏడాది తొలి ఐదు నెలల్లోనే కోటి రూపాయల విరాళాల్ని వివిధ వ్యక్తులకూ, సంస్థలకూ అందించిందంటే, దానికున్న ఆదరణ ఎలాంటిదో అర్థమవుతుంది.

### ఇచ్చినదానికి రెట్టింపు...

మతపరమైన సేవాసంస్థలకు ప్రచారం కల్పించడానికి 'లెట్స్ ఛేంజ్' పూర్తిగా దూరం. విద్య, వైద్యం, ఉపాధి, పెళ్లిళ్లు... వెబ్‌సైట్‌లోకి వెళ్లగానే ఇలా రకరకాల విభాగాలు కనిపిస్తాయి. ఎవరికి ఏ అంశంలో ఆసక్తి ఉంటే ఆ విభాగానికి విరాళాలు ఇవ్వొచ్చు. 'విద్య'పైన క్లిక్ చేస్తే దేశంలోనే వివిధ ప్రాంతాల్లో చదువు ప్రధానంగా పనిచేస్తున్న ఎన్జీవోలూ, అవసరమున్న విద్యార్థుల వివరాలొస్తాయి. మీ ప్రాంతానికి దగ్గర్లో ఉన్న వ్యక్తులకో, సంస్థలకో తోచినంత సాయం చేయొచ్చు. ఇదే సంస్థ ఆధ్వర్యంలో 'లెట్స్ డ్రీమ్' అనే సంస్థ కూడా పనిచేస్తోంది. దాతల నుంచి ఎన్జీవోలకు గ్రాంట్లు ఇప్పించే సంస్థ ఇది. దీని సాయంతో 'లెట్స్ ఛేంజ్' ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఐదు వేల రూపాయలలోపు ఎవరెంత సాయం చేసినా, అంతే మొత్తాన్ని సంస్థ కూడా కలిపి అవసరార్థులకు అందిస్తుంది.

### నెలవారీ ఈఎంఐలా!

విరాళాలు రావాలంటే బోలెడంత ప్రచారం కావాలి. దానికోసమే చాలా స్వచ్ఛంద సంస్థలు లక్షల్లో ఖర్చుపెడుతున్నాయి. దాన్ని నివారిస్తే ఆ డబ్బునూ మంచి అవసరాల కోసం ఉపయోగించొచ్చు. గుర్‌గావ్ కుర్రాడు విక్రాంత్‌కి వచ్చిన ఈ ఆలోచనే 'లెట్స్ ఛేంజ్'కు మూలం. ఐఐటీలో బీటెక్ చదివి, ఐఐఎంలో ఎంబీఏ పూర్తి చేసి ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగంలో చేరాడు విక్రాంత్. తరచూ కంపెనీ 'కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ' కార్యక్రమాల్లో భాగం కావడం అతనికి అలవాటు. ఆ అలవాటే క్రమంగా అతడిని సామాజిక సంస్థ వైపు నడిపించింది. కొంతమంది స్నేహితుల సహాయంతో 'లెట్స్ ఛేంజ్'ను మొదలుపెట్టాడు. దేశంలోని ప్రతి ఉద్యోగితోనూ నెలనెలా ఈఎంఐలా సామాజిక సేవకూ కొంత కేటాయించేలా చేయాలన్నది విక్రాంత్ లక్ష్యం. ఇప్పటికే చాలామంది కార్పొరేట్ ఉద్యోగులు అలా ప్రతినెలా వెబ్‌సైట్‌లోని స్వచ్ఛంద సంస్థలకు విరాళాలిస్తున్నారు. 'విరాళాలు పెరిగే కొద్దీ మా బాధ్యతా పెరుగుతుంది. అందుకే సంస్థను మా వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసేముందు చాలా జాగ్రత్తగా ఉంటున్నాం. ఒకటికి రెండు సార్లు పరిశీలించాకే వాటి వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచుతున్నాం' అంటాడు 'లెట్స్ ఛేంజ్' ఆర్థిక విభాగాన్ని పర్యవేక్షిస్తున్న రాహుల్.

'ఛాంపియన్స్ ఆఫ్ ఛేంజ్', 'ఎన్జీవో ఆఫ్ ది మంత్'... ఇలా రకరకాల పోటీలతో సేవను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నారు. ఇచ్చేది యాభై రూపాయలైనా, అది సరైన వాళ్లకే చేరాలన్నది సంస్థ లక్ష్యం. మరి మీ యాభై ఎవరికి? 'లెట్స్‌ఛేంజ్.కామ్'లోకి ప్రవేశించి మీ ప్రాంతంలో మంచి సంస్థ లేవో సరిచూసుకోండి. ★

